# 9

# “నీవు ఏమవ్వాలనుకుంటున్నావు?”

## (మత్తయి 20:20-28)

*పరిచారకుల నియామక కార్యక్రమంలో నేను బోధించిన క్లుప్త సందేశం ఇది. ప్రసంగానికి ముందు సంఘమంతయూ మత్తయి సువార్తలోని మూల వాక్యాన్ని చదవాలి.*

*నీవు ఎదిగినప్పుడు నీవు ఏమవ్వాలనుకూంటున్నావు?* ఇదే ప్రశ్నను మన పిల్లలను అడుగుతాము.[1] మనం చిన్న పిల్లలముగా ఉన్నప్పుడు మనమూ అదే ప్రశ్నను ఎదుర్కొన్నాము. నా చిన్నప్పుడు, “నేను డాక్టరును అవుతాను” అని సమాధాన మిచ్చేవాడ్ని. నా కాలేజీ రోజుల వరకు నా సమాధానం అదే. తరువాత నేను బోధకుడ్ని కావాలనుకున్నాను.

ఈ రోజున నేను అదే ప్రశ్నను ఆత్మీయార్థంలో అడుగుతున్నాను. మీరు *ఆత్మీయంగా* ఎదిగినప్పుడు మీరు ఏమవ్వాలనుకుంటున్నారు? “... క్రీస్తువలె ఉండుటకు మనమన్ని విషయములలో ఎదుగుదుము” (ఎఫెసీయులకు 4:15) అని వాక్యం మనల్ని సవాలు చేస్తుంది. మనం క్రీస్తువలె ఉండాలి. ఆయన ప్రత్యేక లక్షణాలు ఏమిటి? మత్తయి 20:20-28లో ఆయన తానో *సేవకుడినని* చెప్పుకున్నారు.

“మీరు క్రీస్తులోకి ఎదిగినప్పుడు మీరు ఏమవ్వాలనుకుంటన్నారు?” అన్న ప్రశ్నకు మీరు “నేను పెద్దను లేదా డీకను లేదా ఒక పెద్ద లేదా డీకను యొక్క భార్యను ... లేదా వాక్యోపదేశకుడిని ... లేదా బోధకుడిని ... లేదా సువార్తకుడిని ... లేదా మిషనరీ భార్యను కావలనుకుంటున్నానని” చెప్పవచ్చు. ఇవన్నీ మంచివే; ప్రతి ఒక్కరికీ ఇలాంటి లక్ష్యాలే ఉండాలి. అయితే, దేవుడు మనలను మన సామర్థ్యంతో వాడుకోవాలంటే, మొదటిగా ప్రధానంగా మనం *సేవకులుగా* ఉండాలి.

ఈ రోజున పరిచారకులను నియమిస్తున్నాం. పరిచారకులు పనిని కొద్ది నిమిషాల సేపు ధ్యానిస్తున్నాం అయితే, పరిచారకునిగా ఉండడం అంటే ఘనత, గౌరము, గుర్తింపు హోదా కాదు. ఇది ఒక్కసారి గుర్తించబడిన, ఒక్కసారి విమర్శలను ఎదుర్కొనే పని, ఎందుకంటే ఈ పని *సేవకుల* పని.

### ఒక సార్వత్రిక సవాలు

ఇంగ్లీషు మాట “deacon” అనేది diakonos అను గ్రీకు మాట అనువాదము. ఈ గ్రీకు పదానికి “సేవకుడు” అని అర్థం: ఇతరుల కోసం పనిచేయువాడు, ఇతరుల నిమిత్తం బాధ్యత వహించువాడు. ప్రాథమికంగా పెద్దలు తమ పనిని లేదా కొంత పనిని వీరికి అప్పగించి కాపరి పనిని నిర్వర్తిస్తుంటారు, సంఘంగా మీరు ఇంతమంది (సంఖ్య) పరిచారకులను ఎన్నుకున్నారు: ఇంతమంది (సంఖ్య) క్రైస్తవ పురుషులు, (సంఖ్య) క్రైస్తవ తండ్రులు, భర్తలు, మంచి తలాంతులు సామర్థ్యాన్ని కల్గియున్నారు. వీరిని సేవ చేసేందుకు ఎన్నుకున్నారు – ఎందుకంటే “పరిచారకుడు” అంటే అర్థం అదే.

అయితే, పరిచర్య చేయడం డీకన్లకే పరిమితం కాలేదు. మనం బాప్తిస్మం పొందినప్పుడు (వచనములు 17; చూడుము 3, 4) మనం హృదయపూర్వకంగా లోబడ్డామనే పౌలు రోమా 6లో చెప్తున్నాడు . "పాపము నుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి" అని తరువాత 18 వచనంలో వ్రాస్తున్నాడు. మనం "దేవునికి దాసులము" అని 22వ వచనంలో చెప్తున్నాడు. మనం "నీతికి దాసులు" మరియు "దేవునికి *సేవకులము*" (నొక్కి చెప్పింది నేను) అని KJVలో వ్రాయబడింది. మరో పత్రికలో పౌలు, "ప్రేమ కలిగి ఒకనికొకడు దాసులై యుండుడి" (గలతీయులకు 5:13).

దేవునికి సేవ చేయాలి; ఒకరికొకరము సేవ చేసుకోవాలి. క్రైస్తవ్యం అంటే ఇదే. మనం పెద్దలుగా ఉన్నామా లేక పరిచారకులుగా ఉన్నామా అన్నది అనవసరం కానీ మనం సేవకులుగా ఉన్నామా అన్నదే ముఖ్యం. దేవున్ని ఇతరులకు సేవ చేయడంలో ఆయన మనకిచ్చిన తలాంతులను ప్రయోగించి సేవా జీవితం గడపాలని ప్రతి ఒక్కరూ నిర్ణయించుకోవాలి.

## ఆలోచన రేకెత్తించే ఒక సంఘటన

మత్తయి 20:20–28లో యేసు తన శిష్యులకు పరిచర్య చేయడం గురించి నేర్పిస్తున్నారు. యెరూషలేములో ఆయనకు ఏం జరుగనుందో, అనగా ఆయన త్వరలోనే *చనిపోతారన్న* విషయాన్ని అంతకు ముందే చెప్పారు (వచనములు 17–19). అప్పుడు సలోమి వచ్చింది (మార్కు 15:40 చూడండి). ఆమె జెబదయి భార్య మరియు యోహాను, యాకోబుల తల్లి యేసు సిలువ గురించి చెప్తుంటే ఆమె సింహాసనం కిరీటం గురించి ఆలోచిస్తుంది. ఆయన *బాధ్యత* గురించి చెప్తుంటే ఆమె *బహుమానం* గురించి ఆలోచిస్తుంది. ఆయన *శ్రమ* గురించి చెప్తుంటే ఆమె *స్థానం* గురించి *ఆలోచిస్తుంది.*

అంతేగాకుండా, "నీ రాజ్యమందు ఈ నా ఇద్దరు కుమారులలో ఒకడు నీకుడివైపునకు ఒకడు నీ ఎడమ వైపునకు కూర్చుండ సెలవిమ్మని" ఆమె అడిగింది. అందుకాయన తల అడ్డంగా ఊపి ఉంటారనుకుంటాను. "మీరేమి అడుగుతున్నారో అది మీకు తెలియదు" (22ఎ వచనం) అని ఆయన అన్నారు. రాజ్యం భౌతికమైంది కాదని అది ఆత్మీయమైనదని ఆమె అర్థంచేసుకోలేదు. అంతేగాకుండా దేవుని రాజ్యంలో పరిచర్య చేయించుకోవడం ఉండదు కానీ, పరిచర్య చేయడమే ఉంటుందని ఆమెకు అర్థం కాలేదు.

"నేను త్రాగబోవు గిన్నెలోనిది మీరు కూడా త్రాగగలరా?" (వచనము 22బి) అని యేసు యాకోబు, యోహానులను అడిగారు. ఆయన దృష్టిలో 17నుండి 19వరకు చెప్పిన సిలువ శ్రమ ఉంది కానీ వారు మాత్రం అదో కష్టతర పని అనుకుంటున్నారు. బహుశా ఆయన శత్రువులను యుద్ధంలో ఓడించి సింహాసనం ఎక్కడం అయ్యుండవచ్చు, వారు ఎంతో ధైర్యముంది అందుకే "త్రాగగలము" (వచనము 22సి) అని చెప్పారు. వారి తల్లిలా వారికీ ఏం చెప్తున్నారో గ్రహింపులేదు.

యేసు తలాడించి "మీరు నా గిన్నెలోనిది త్రాగుదురు" (వచనము 23ఎ) అని చెప్పారు. ఆయన భవిష్యత్తును చూస్తున్నారు. హతసాక్షిగా మొట్టమొదటి అపొస్తలుడు యాకోబు చనిపోతాడని ఆయనకు తెలుసు (అపొస్తలుల కార్యములు 12:2). యోహాను చెరపట్టబడి పత్మాసు ద్వీపంలో శ్రమనొందుతాడని ఆయనకు తెలుసు (ప్రకటన 1:5). "నా కుడివైపునను నా ఎడమవైపునను కూర్చుండ నిచ్చుట నా వశమున లేదు" అని ఆయన చెప్తున్నారు

(మత్తయి 20:23బి). అది దేవుని పని (వచనం 23సి). పరలోకంలోని ఘనత అంతయూ పరిచర్య *చేయు వారి* కొరకేనని తరువాత యేసు చెప్పారు.

యాకోబు, యోహానుల విన్నపాన్ని ఇతర అపొస్తలులు విన్నప్పుడు, వారు "ఈ ఇద్దరు సహోదరుల మీద కోపపడిరి" అని 24వ వచనం చెప్తుంది. యాకోబు యోహానులు స్థానాలను కోరుతున్నారు కాబట్టి మిగతా పదిమంది కోపగించారు. ఎందుకంటే విరిద్దరూ వారికంటే ముందుగా పోవాలని చూస్తున్నారు. అసలు వారు దాని గురించే ఆలోచించలేదు కాబట్టి వారు సంతోషంగా లేరు.

అప్పుడు యేసు పన్నెండు మందిని తన యొద్దకు పిలిచి రాజ్యమంటే ఏమిటో, ప్రజల హృదయాల్లో ఆయన పాలన ఎలా ఉంటుందో వివరిస్తున్నారు. "అన్యజనులలో అధికారులు వారి మీద ప్రభుత్వము చేయుదురనియు వారిలో గొప్పవారు వారిమీద అధికారము చేయుదురనియు మీకు తెలియును" (25 వచనం) అని చెప్తున్నారు. అవునన్నట్లే అపొస్తలులు తలూపి యుంటారు. ఈ లోకంలో ఎవరికి ఎక్కువ అధికారం ఉందో వారు గొప్ప అని వారు ఎరిగియున్నారు.

"మీలో అలాగుండకూడదు" (26ఎ వచనం) అని ఆయన అన్నారు. ఆయన రాజ్యం ఈ లోక రాజ్యం వంటిది కాదని ఆయన శిష్యులు ఎరిగియుండాలని ఆయన ఆశపడుతున్నారు. బహుశా వారికేమి అర్థం అయ్యుండదు. యేసు రాజ్యంలో ఎవరు గొప్ప? "మీలో ఎవడు గొప్పవాడైయుండగోరునో వాడు మీ పరిచారకుడై యుండవలెను. మీలో ఎవడు ముఖ్యుడైయుండగోరునో వాడు మీ దాసుడై యుండవలెను" (26బి, 27 వచనాలు) అని అన్నారు. తన రాజ్యంలో పరిస్థితి తలక్రిందులుగా లేదా విభిన్నంగా ఉంటుందని ఆయన శిష్యులు గ్రహించాలని ఆయన అశించారు. సేవకుడైయుండాలి. దాసుడైయుండాలి మీ హక్కుల గురించి ఆలోచించకండి మీ పనికి పేరు ఎవరికి వస్తుందోనని ఆలోచించకండి. పరిచర్య మాత్రం చేయండి.

ఆయన వ్యక్తిగతంగా పరిచర్య చేసేందుకు సిద్ధంగా లేకుండా ఇతరులను పరిచర్య చేయమని చెప్తున్నాడా? లేదు. ఆయన ఇంకనూ మాట్లాడుతూ, ఆ పరిచర్య యెరూషలేములో తన మరణంలో కేంద్రీకృతమై యుందని చెప్తున్నాడు. "అలాగే మనుష్యకుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రయ ధనముగా తన ప్రాణము నిచ్చుటకు వచ్చెనని చెప్పెను" (28 వచనం). దేవునిగా. మనుష్య కూమారునిగా, సర్వ సృష్టికర్తగా (యోహాను 1:1–3), ఆయనకు పరిచారం చేయించుకునే హక్కు ఉంది (చూడండి ఫిలిప్పీయులకు 2:6–8). కానీ ఆయన పరిచారము చేసేందుకే వచ్చారు. అంతేకాదు, పాపం చేత దాసులమై యున్న మనందరి నిమిత్తం విమోచన క్రయధనముగా ఉండేందుకే గొప్ప పరిచర్య, సేవ – అయిన సిలువ మరణం పొందేందుకే ఆయన వచ్చారు.

### ముగింపు

ఇక్కడ కూర్చున్న వీరందరూ ఆయా పరిచర్యలకు సిద్ధమవుతుండగా దేవుడు వీరికి తోడుగా నుండును గాక. అలాగే, గొప్ప పరిచారకుడైన యేసుని సారూప్యంలోకి దిన దినము మారుతున్న మనకును ఆయన తోడుగానుండును గాక.